సాక్షి
సూర్యాపేట
సోమవారం । 18 । డిసెంబర్ । 2023



ప్రజా సేవకులం
తాము పాలకులం కాదని, ప్రజా సేవకుల మని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో



మట్టపల్లిలో నిత్యపూజలు
మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. - 8లో



ఏక కుండాత్మక యజ్ఞం
యాదాద్రి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి ఆలయంలో ఆదివారం ఏక కుండాత్మక యజ్ఞాన్ని ప్రారంభించారు. - 8లో

న్యూస్‌రీల్

ఉత్తమ డీసీసీబీ చైర్మన్‌గా గొంగిడి మహేందర్‌రెడ్డి



గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి జాతీయ స్థాయిలో ఉత్తమ సహకార బ్యాంకు చైర్మన్‌గా ఎంపికయ్యారు. సహకార రంగంలో చేసిన కృషికిగాను ఉత్తమ చైర్మన్ అవార్డుకు ఎంపిక చేసినట్లు న్యూఢిల్లీలోని ఇంటలెక్చువల్ పీపుల్స్ ఫౌండేషన్ ఆయనకు లేఖను పంపింది. 2024 జనవరిలో న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఉత్తమ బ్యాంకు చైర్మన్ అవార్డును అందజేయనున్నట్లు తెలిపింది. తనకు అవార్డు రావడానికి సహకరించిన వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, ఇతర పాలకవర్గ సభ్యులు, జిల్లా రైతులు, సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంకు అధికారులు, సిబ్బందికి చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ధన్యవాదాలను తెలిపారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి



దాస్‌తండాలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట రూరల్: ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండల పరిధిలోని దాస్‌తండాలో నూతన ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆంజనేయ స్వామి అనుగ్రహంతో గ్రామంలోని ప్రతి కుటుంబం చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకారా కృషి మరువలేనిది



నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

భానుపురి (సూర్యాపేట): ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ సాధనకు డీఎస్ నకారా చేసిన కృషి మరువలేనిదని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు అన్నారు. జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవాన్ని సూర్యాపేట పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పెన్షన్‌దారుల సంఘం వ్యవస్థాపకుడు డీఎస్ నకారా చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి హమీద్ ఖాన్, మండల కోశాధికారి జి.సోమయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.సురేందర్‌రెడ్డి, జి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొట్టేవారిని తరిమికొట్టాలి

నూతనకల్: దేశంలో మతోన్మాదం పేరుతో ప్రజలను రెచ్చగొట్టేవారిని తరిమికొట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు ఆవునూరి మధు పిలుపునిచ్చారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో గునగంటి సత్యనారాయణ జ్ఞాపకార్థం నిర్మించిన విజ్ఞాన కేంద్రాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని పాలకులు అన్ని రంగాల్లో నిర్వీర్యం చేశారని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించిన సత్యనారాయణ సతీమణి జగదాంబ, వారి కుటుంబ సభ్యులను పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాచకొండ జనార్దన్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న, పెద్దింటి రంగారెడ్డి, గంటా నాగయ్య, దేసోజు మధు, మున్నా అశోక్, సుంకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మిల్లర్ల మాయాజాలం

- ప్రభుత్వానికి సకాలంలో సీఎంఆర్ అందించకుండా జాప్యం
- ఇచ్చిన ధాన్యాన్ని మరాడించి బియ్యం అమ్ముకుంటున్నట్టు ఆరోపణలు
- మిల్లుల వద్ద కనపడని ధాన్యం నిల్వలు
- యాసంగి సీజన్‌కు సంబంధించి ఇచ్చింది ఐదు శాతం బియ్యమే
- వానాకాలం సీఎంఆర్ కూడా 35 శాతం పెండింగ్‌లోనే..



కోదాడ: ప్రభుత్వానికి ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సకాలంలో ఇవ్వకుండా జిల్లాలోని మిల్లర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. ధాన్యం తీసుకొని మరాడించి బయటి మార్కెట్‌లో బియ్యం వ్యాపారం సాగిస్తున్నట్టు బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి సీఎంఆర్ అప్పగించే విషయంలో రాష్ట్రంలోనే సూర్యాపేట జిల్లా ప్రతి సీజన్‌లో వెనుకబడి ఉంటోందని అధికారులే అంటున్నారు. 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించి వందకు ఇప్పటి వరకు కేవలం 5శాతం బియ్యం మాత్రమే ఇవ్వడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో పలువురు మిల్లర్లు ప్రజాప్రతినిధుల అండతో అధికారులను బెదిరిస్తూ బియ్యం ఇవ్వకుండా కాలం గడుపుతూ వస్తున్నారు. తాజాగా జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చెపట్టడంతో పాటు రెండు రోజుల క్రితం నిర్వహించిన ఆ శాఖ సమీక్షలో సీఎంఆర్ విషయంపై సీరియస్‌గా ముందుకు పోతామని ప్రకటించడంతో అధికారులు సతమతమవుతున్నారు.

2022-23 యాసంగి సీజన్‌లో మిల్లర్లు ఇవ్వాల్సిన సీఎంఆర్ వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

ఇవ్వాల్సిన బియ్యం	2,42,359
ఇప్పటి వరకు ఇచ్చినవి	12,251
పెండింగ్	2,30,108

పైసా పెట్టుబడి లేకుండా రూ.కోట్ల వ్యాపారం
రైతుల నుంచి ప్రభుత్వం ఐకేపీ, సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం సీఎంఆర్ కోసం మిల్లర్లకు అప్పగించింది. వానాకాలం సీజన్ సీఎంఆర్ ఇవ్వాల్సిన మిల్లర్లు వాటిని ఇవ్వకుండానే యాసంగి ధాన్యం తీసుకున్నారు. ఈ ధాన్యం తీసుకొని కూడా దాదాపు ఐదారు నెలలు కావొస్తున్నా ఇప్పటి వరకు ఐదు శాతం బియ్యం కూడా ఇవ్వలేదు. బియ్యం ఇవ్వనప్పుడు దానికి సంబంధించిన ధాన్యం మిల్లుల వద్ద నిల్వ ఉండాలి కానీ చాలా మిల్లుల వద్ద ధాన్యం నిల్వలే లేవని అధికారులు అంటున్నారు. మిల్లర్లు తీసుకున్న ధాన్యం మర ఆడించి ఆ బియాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారని వారు అంటున్నారు. పైసా పెట్టుబడి లేకుండా కోట్ల రూపాయల ప్రభుత్వ ధాన్యం తీసుకొని వ్యాపారం చేసుకుంటున్న మిల్లర్ల జోలికి వెళ్లడానికి అధికారులే బయపడిపోతున్నారని ప్రచారం జరుగుతోంది. రాజకీయ నేతల నుంచి జిల్లా స్థాయి అధికారులకు ఫోన్‌లు చేయిస్తుండడంతో కింది స్థాయిలో ఉన్న తాము ఏమి చేయలేని పరిస్థితి నెలకొందని వారు అంటున్నారు. జిల్లాలోని కోదాడ, తుంగతుర్తికి చెందిన ఇద్దరు బడా మిల్లర్ల వద్ద కోట్ల రూపాయల విలువైన ధాన్యం మాయమైందని, వీరు జిల్లాకు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల ద్వారా ఇప్పటి వరకు అధికారులను బెదిరించి పబ్బం గడుపుకుంటున్నారని వారి వల్ల అందరికి చెడ్డ పేరు వస్తుందని కొందరు మిల్లర్లు రెండు రోజుల క్రితం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

కఠిన చర్యలు తప్పవు



మిల్లర్ల నుంచి ప్రతి గింజ బియ్యాన్ని వెనక్కి తీసుకుంటాం. గత ప్రభుత్వం విధానాల వల్ల పౌరసరఫరాల శాఖ అప్పుల్లో కూరుకు పోయింది. ఈ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తాను. అన్ని జిల్లాల నుంచి సమాచారం తీసుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకొని సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై కఠిన చర్యలు తప్పవు. ఇది జిల్లా నుంచే ప్రారంభిస్తాను. సీఎంఆర్ విషయంలో అధికారుల పాత్ర ఉన్నా చర్యలు తీసుకుంటాం.
– ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

మిగిలింది 12 రోజుల గడువే..
2022–23 యాసంగి సీజన్ సీఎంఆర్‌ను పూర్తిస్థాయిలో ఇవ్వని మిల్లర్లు అదే ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని కూడా ఇప్పటి వరకు పూర్తిగా ఇవ్వలేదు. ప్రధానంగా యాసంగికి సంబంధించి 2,30,108 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను ఇవ్వాల్సి ఉంది. అలాగే గత వానాకాలం సీజన్‌కు సంబంధించి 2,22,274 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 1,43,858 మెట్రిక్ టన్నులు ఇవ్వగా ఇంకా 78,416 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. గత వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు కొప్పు కొని మొత్తం 3,08,524 మెట్రిక్ టన్నుల బియాన్ని ఈ నెల 31 వరకు మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాలి. కానీ, దీనిలో 10 శాతం కూడా వారు ఇచ్చే సూచనలు కనిపించడం లేదని అధికారులు అంటున్నారు. అంటే సీఎంఆర్ పూర్తిగా ఇచ్చే గడువు 12 రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ కొద్ది సమయంలోనే మిగిలిన బియ్యం మిల్లర్లు ఎలా ఇస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది.

సందిగ్ధంలో 'గృహలక్ష్మి'

- ప్రభుత్వం మారడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన
- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కొత్త సర్కార్ హామీ
- పాత దరఖాస్తులను ఆమోదించేనా..
- జిల్లాలో 58,564 మంది అర్జీదారులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారుల్లో సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గత ప్రభుత్వం తీసుకున్న దరఖాస్తులు ఆమోదిస్తారా? ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మళ్లీ స్వీకరిస్తారా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తే గతంలో గృహలక్ష్మి పథకం కింద ఎంపికై ఇళ్ల మంజూరు పత్రాలు అందించిన చోట ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు. గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తే ఇప్పటి వరకు పడిన శ్రమ, పెట్టిన ఖర్చు వృథాయేనా? అనే గందరగోళ పరిస్థితి నెలకొంది.

డబుల్ బెడ్‌రూం సక్సెస్ కాకపోవడంతో..
గృహలక్ష్మి పథకానికి ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. జిల్లాలో అనుకున్న స్థాయిలో ఆ పథకం సక్సెస్ కాలేదు. లబ్ధిదారులు ఎక్కువగా ఉండటం.. నిర్మించిన ఇళ్లు తక్కువ కావడంతో సర్వత్రా ఆందోళనలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద సొంతస్థలం ఉన్న వారికి గృహ నిర్మాణం కోసం మూడు విడతల్లో రూ.3లక్షల నగదు ఇస్తామని చెప్పి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో మొత్తం 58,564 దరఖాస్తులు రాగా క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు పరిశీలించారు. వీటిలో 34,849 మందిని అర్హులుగా తేల్చి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3వేల యూనిట్ల చొప్పున జిల్లాలోని నాలుగు నియోకవర్గాల్లో 12వేల యూనిట్లకు మంజూరు పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. దీంతో వారంతా సంతోషంలో మునిగిపోయారు. మిగతా ఆశావహులు సైతం వారికి అందుతాయని భావించారు. ఇంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం చకచకా జరిగిపోయాయి. తమ హామీల్లో భాగంగా గృహలక్ష్మి స్థానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకున్న వారిలో ఆందోళన నెలకొంది.

కొత్త ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు
ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇందిరమ్మ గృహ నిర్మాణం పథకం అమలు చేయాలని యోచిస్తోంది. దీంట్లో భాగంగా ఇంటి నిర్మాణానికి ఇప్పటికే రూ.5 లక్షలు ప్రకటించింది. సాయం పెంపుపై అంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నా.. కొత్త పథకం ఎప్పుడు ప్రారంభిస్తారో, విధివిధానాలు ఎలా ఉంటాయోనన్న ఉత్కంఠ ప్రజల్లో నెలకొంది. దీనిపై కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయితే జిల్లాలో సుమారు 70 వేలకు పైగా కుటుంబాలు సొంతిల్లు లేక అద్దె ఇళ్లలో నివసిస్తున్నట్టు సమాచారం.

బీజేపీ మతోన్మాదాన్ని ఐక్యంగా అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు

దురాజ్‌పల్లి(సూర్యాపేట): దేశ లౌకిక వ్యవస్థ, ప్రజల ప్రజాస్వామిక హక్కులకు ప్రమాదకరంగా మారుతున్న బీజేపీ మతోన్మాద ఫాసిజాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విప్లవకారులంతా ఐక్యంగా అడ్డుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గోకినపల్లి వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్‌లో పార్టీ జిల్లా నాయకుడు పేర్ల నాగయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పనంగా కట్టబెడుతోందన్నారు. వచ్చే ఏడాది మార్చి 3, 4, 5వ తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ(ఎంఎల్) రీవాల్యుషనరీ ఇనిషియేటివ్ మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభ సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, మట్టపల్లి అంజయ్య, లక్ష్మయ్య, నర్సయ్య, పల్లయ్య, రాంజీ, చంద్రకళ, వీరబాబు, రేణుక, దుర్గయ్య, సయ్యద్, నవీన్‌రెడ్డి, కర్నాకర్, బాజీ, రమణ, పద్మ, సునీల్, గౌరమ్మ పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టి నిజాభిషేకం, అర్చన గావించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్ కల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం





వ్రత మహోత్సవానికి హాజరైన భక్తులు, ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు

భానుపురి: సూర్యాపేట పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ధనుర్మాస వ్రత మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం ఆండాళ్ గోష్ఠి మహిళా భక్తులు మంగళహారతులతో దేవాలయానికి చేరుకొని గోదా శ్రీనివాస స్వామి అష్టోత్తర శతనామాలు పఠించి గోదాదేవి పాడిన 30 పాటలు తిరుప్పావై చదివారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ధనుర్మాస వైభవాన్ని, తిరుప్పావైలోని మొదటి పాశుర అర్థాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వై.శ్రీనివాసరెడ్డి, రవీందర్, కరుణాసాగర్ రెడ్డి, మంజుల, జ్యోతి, జ్ఞానకుమారి, చకిలం మాధవి, సుమాల, ఉల్లెందుల అరుణ, వెంపటి విజయ, ఉమారాణి, ఉపేంద్ర పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపే లక్ష్యం

- ఆదర్శ పాఠశాలల్లో వృత్తి విద్యాశిక్షణ
- ఉద్యోగ ఉపాధి రంగాల్లో స్థిరపడేందుకు దోహదం
- 4,500 మంది విద్యార్థులకు ప్రయోజనం



బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్న ట్రైనర్

నాగారం : గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో కార్పొరేట్ స్థాయి బోధనే లక్ష్యంగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఈ బడుల్లో 6 నుంచి 12వ తరగతి వరకు నాణ్యమైన బోధన అందుతోంది. చదువులు పూర్తికాగానే నైపుణ్యాలు కొరవడి ఉద్యోగాలు దక్కించుకోవడంలో వెనుకబడిపోతున్నారు. వివిధ కారణాల రీత్యా మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ అందించేందుకు చేపడుతున్న ప్రక్రియ సత్ఫలితాలనిస్తోంది. నైపుణ్య తర్ఫీదు పూర్తికావడంతో ఉపాధిపై ఆత్మవిశ్వాసం పెరుగుతోంది.

ఆదర్శ పాఠశాలలు	9
9, 10, ఇంటర్ విద్యార్థుల సంఖ్య	4,500

ప్రయోగాత్మకంగా..
జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది విద్యార్థులు చదువుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నా ఆర్థిక పరిస్థితుల కారణంగా కెరీర్లో ముందుకెళ్లలేక పోతున్నారు. ఉన్నత చదువులు చదువుకునే పరిస్థితి లేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. విద్యార్థినులను ఇతర ప్రాంతాలకు పంపేందుకు తల్లితండ్రులు వెనుకాడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఆదర్శ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా వృతివిద్యా కోర్సులను ప్రవేశ పెట్టారు. కంప్యూటర్, ఐటీ, బ్యూటీ వెల్నెస్, హెల్త్‌కేర్, అగ్రికల్చర్, కుట్లు, అల్లికలు, పర్యాటకం తదితర మొత్తం 12 రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు..
ఇంటర్ తర్వాత చదువులు మానేసిన వారికి నైపుణ్య శిక్షణ భరోసా కలిగిస్తోంది. కంప్యూటర్ అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హార్డ్ వేర్ రంగాల్లో ఉపాధి లభిస్తోంది. వైద్యాలయాలు, ప్రయోగశాలల్లో పని చేసేందుకు అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయ రంగాల్లోనూ ఆధునిక సాగు పద్ధతులు నేర్చుకోవడం ద్వారా అవగాహన పెరుగుతోంది. పర్యాటక రంగాల్లో ఉద్యోగావకాశాలు భారీగా ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు వృత్తి విద్యాశిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ తొమ్మిది, పది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వరకు నాలుగు దశల్లో ఉంటుంది. ప్రతి పాఠశాలలో రెండు కోర్సులను అమలు చేస్తున్నారు. ఒక్కో పాఠశాలలో 9 నుంచి ఇంటర్ వరకు ఉంటుంది. జిల్లాలో మొత్తం 4,500 మంది విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణతో ప్రయోజనం చేకూరుతుంది. ఆయా కోర్సుల్లో రోజూవారీగా నైపుణ్య మెళకువలు నేర్పిస్తున్నారు. నెలకు ఒకసారి క్షేత్రస్థాయి సందర్శన నిర్వహిస్తుండటంతో సత్ఫలితాలను ఇస్తుంది. నాలుగేళ్ల తర్వాత ప్రభుత్వం నుంచి ధ్రువీకరణ పత్రం అందిస్తారు. స్వయం ఉపాధి రుణాలు పొందేందుకు ఈ పత్రం దోహదపడుతుంది.

భవిష్యత్తులో రాణించేందుకు ..



విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వృత్తివిద్యా కోర్సులను నేర్పించడం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్నాం. ఇంటర్ పూర్తయిన తర్వాత అనుకోని కారణాలతో చదువు మానేసినా జీవితంలో ముందుకు వెళ్లేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.
– అశోక్, డీఈఓ, సూర్యాపేట.

పేద రోగులకు భరోసా!

- బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యాధునిక వైద్య సదుపాయాలు
- నామమాత్రపు ఫీజుకే సూపర్ స్పెషాలిటీ వైద్యం
- పెరుగుతున్న రోగుల తాకిడి
- రెండేళ్లలో 4లక్షల మందికి పైగా సేవలు
- 350 పడకల విస్తరణకు సన్నాహాలు



ఎయిమ్స్‌లోని ఓపీ విభాగం వద్ద బారులుదీరిన రోగులు


బీబీనగర్ : బీబీనగర్‌లో ఏర్పాటైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) నిరుపేదలకు వరంగా మారింది. ఎంతో ఖరీదైన కార్పొరేట్ వైద్యం ఇక్కడ అత్యంత చౌకధరలకే అందుతోంది. కేవలం పది రూపాయలకే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రత్యేక వైద్యనిపుణులు అందుబాటులో ఉండడంతో నానాటికీ రోగుల తాకిడి అధికమవుతోంది. యాదాద్రి భువనగిరి నుంచే కాకుండా హైదరాబాద్ జంటనగరాలు, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, జనగాం, వరంగల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల నుంచి రోగులు తరలివస్తున్నారు. రోజూ 2వేల మందికి పైగా ఎయిమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్నారు.

దశలవారీగా విస్తరణ
నిరుపేదలకు మెరుగైన, అత్యాధునిక వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ఎయిమ్స్ పని చేస్తోంది. ఇందుకోసం దశలవారీగా సేవలను విస్తరిస్తున్నారు. 2020 జూన్ 2వ తేదీన 50 పడకల సామర్థ్యంతో ఎయిమ్స్‌ను ప్రారంభించారు. క్రమేణా రోగుల సంఖ్య పెరగడంతో 2021 డిసెంబర్‌లో 100 పడకలకు ఇన్‌పేషెంట్ సేవలను అందుబాటులో తీసుకువచ్చారు. కేవలం పది రూపాయలకే ఓపీడీ ఉండడం, ఈసీజీ, ఎక్స్‌రే తదితర పరీక్షలకు నామమాత్రపు ఫీజు వసూలు చేస్తుండడంతో ఎయిమ్స్‌కు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. రోగుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 100 పడకల ఇన్‌పేషెంట్ సేవలను మరో ఐదు నెలల్లో 350 పడకలకు మార్చే దిశగా ఎయిమ్స్ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం అవసరమయ్యే వైద్యులు, సిబ్బంది 300 పోస్టుల భర్తీకి కేంద్ర వైద్యారోగ్య శాఖ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న వివిధ విభాగాలకు సంబంధించిన భవనాలు అందుబాటులోకి రాగానే 700 పడకలకు ఆస్పత్రి సామర్థ్యం పెంచనున్నారు.

అందుబాటులో ఉన్న వైద్యసేవలు
ఎయిమ్స్‌లోని ప్రసుత్తం జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, అప్తమాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రేడియాలజీ, పీడియాట్రిక్, ఇంటెన్సివ్ కేర్, ప్రసూతి, పీఐసీయూతో పాటు ఎమర్జెన్సీ వైద్య సేవలను అందిస్తున్నారు. త్వరలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇక ఎమ్ఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్, ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలతో పాటు మరికొన్ని టెస్టులు నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ స్థాయి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోకుండా జర్మనీ దేశం నుంచి అత్యాధునిక వైద్య పరికరాలు తెప్పించి సేవలందిస్తున్నారు.

4లక్షల మందికి వైద్యసేవలు
ఎయిమ్స్‌లో ప్రస్తుతం రోజూ 1,850 వరకు ఔట్‌పేషెంట్, 150 మంది వరకు ఇన్‌పేషెంట్ సేవలు పొందుతున్నారు. ఇప్పటి వరకు నాలుగు లక్షలకు పైగా రోగులు వైద్యసేవలు పొందినట్లు ఎయిమ్స్ అధికారులు చెబుతున్నారు.

రోగుల సంఖ్య పెరుగుతోంది



నిరుపేదలకు అత్యాధునిక వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. అతిచౌక ధరకు సూపర్ స్పెషాలిటీ వైద్యం, వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడంతో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ సేవల కోసం రోజూ 2వేల మంది వరకు ఆస్పత్రికి వస్తున్నారు. ఎంతమంది వచ్చినా ఇబ్బంది కలగకుండా సేవలందిస్తున్నాం. దశలవారీగా సేవలను విస్తరిస్తున్నాం. ప్రస్తుతం 100 పడకలతో ఉన్న ఇన్ పేషెంట్ సేవలను 350 పడకలకు పెంచే దిశగా చర్యలు చేపట్టాం. ఎయిమ్స్‌లో అందజేస్తున్న సూపర్ స్పెషాలటీ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
– వికాస్ భాటియా, ఎయిమ్స్ డైరెక్టర్, బీబీనగర్

క్లుప్తంగా

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీర హనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వాహకులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

కల్మలచెరువు వాసికి సేవారత్న అవార్డు



సేవారత్న అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాస్

గరిడేపల్లి : సామాజిక సేవా రంగంలో విశేష సేవలందించినందుకు గాను గరిడేపల్లి మండలం కల్మలచెరువు గ్రామానికి చెందిన పగడాల శ్రీనివాస్ అంతర్జాతీయ సేవా రత్న అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడేపల్లిగూడెం కళావేదికలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో శ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమావతి చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ సేవా రంగంలో చేసిన కృషికి ఇప్పటికే రెండు జాతీయ అవార్డులు, డాక్టరేట్ ,అంతర్జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డు రావడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గోవుల పట్టివేత

చింతపల్లి : హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న గోవుల వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి సంత నుంచి హైదరాబాద్‌లోని కబేళాలకు గోవులను తరలిస్తున్నారన్న సమాచారంతో చింతపల్లి మండల కేంద్రంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో మల్లేపల్లి నుంచి టాటా ఏస్ వాహనంలో మూడు ఆవులు, ఐదు కోడెలు తరలిస్తుండగా పట్టుకున్నారు. గోవులను రంగారెడ్డి జిల్లా వెల్దండ గోశాలకు తరలించి, వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పాలకులం కాదు.. ప్రజా సేవకులం

- ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్
- ఆరు గ్యారంటీ స్కీంలతో అద్భుత పరిపాలన అందిస్తాం
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విజయోత్సవ ర్యాలీలో మంత్రి పొంగులేటి



నకిరేకల్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్ : పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన అప్పటి టీఆర్ఎస్ ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ మాటల గారడీతో మభ్యపెట్టి ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు. నకిరేకల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన ఎమ్మెల్యే వేముల వీరేశం విజయోత్సవ ర్యాలీలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని ప్రజలు మంచి మెజారిటీతో కాంగ్రెస్‌కు దీవెనలు అందించారన్నారు. తాము పాలకులం కాదని, ప్రజా సేవకులమని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.రాబోయే ఐదేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అద్భుతమైన పరిపాలన అందిస్తామన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలకు చట్ట బద్ధత కల్పించామని పేర్కొన్నారు. వీటిలో రెండు కార్యక్రమాలను ఇప్పటికే అమలులోకి తెచ్చినట్లు మంత్రి చెప్పారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల సహకారంతో నకిరేకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తానన్నారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి, డ్రగ్స్ దందాను అరికట్టేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ర్యాలీలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్, శాసన మండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, చామల శ్రీని వాస్, దైద రవీందర్, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగధర్‌రావు,గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, నకిరేకంటి ఏసుపాదం, నరేందర్, కొండ వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

- సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

మాడుగులపల్లి : ప్రజా సమస్యలపై నిబద్ధతతో పోరాడేది కమ్యూనిస్టు నాయకులేనని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో పార్టీకి తాము ఆశించిన స్థాయిలో ప్రజాదరణ లభించలేదని, అయినా నిరుత్సాహపడకుండా ప్రజల్లో ఉంటూ పని చేస్తామన్నారు. ఎన్నికల ఫలితాలు తాత్కాలికమేనని.. విలువలు, ఆశయాలతో పనిచేసే కమ్యూనిస్టుల సేవలను ప్రజలు భవిష్యత్‌లో తప్పక గుర్తిస్తారని ఆయన పేర్కొన్నారు. మండలంలో సమస్యల పరిష్కారానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మేనిఫెస్టో హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వెల్లడించారు. అంతకుముందు స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, సీనియర్ నాయకుడు అశోక్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు ఎర్ర కన్నయ్య, పతాని శ్రీను, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు వలస కార్మికులు మృతి

భూదాన్‌పోచంపల్లి: వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌సిలిండర్ నుంచి మంటలు అంటుకొని తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికులు సుజయ్ ధర్మాని(55), నాగేంద్రనాథ్ మండల్(50) ఆదివారం మృతిచెందారు. ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి మండలం ఇంద్రియాల గ్రామానికి చెందిన శెట్టి సురేశ్ మూసీ పరీవాహక గ్రామాల్లో వరినాట్లు వేయించేందుకు ఈ నెల 13న ఉదయం పశ్చిమబెంగాల్‌కు చెందిన 10 మంది వలస కూలీలను రప్పించాడు.మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లిలో మూతపడిన ప్రభుత్వ పాఠశాలలో వారికి ఆశ్రయం కల్పించాడు. వారు మధ్యాహ్నం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్‌పైపుకు మంటలు అంటుకొని పైప్ కాలిపోయింది. దాంతో చెలరేగిన మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా ఆరుగురు గాయపడ్డారు. వీరందరినీ చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా సుజయ్ ధర్మాని, నాగేంద్రనాథ్ మండల్ మృతిచెందారు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారని, వారికి ప్రాణాపాయం ఏమీలేదని ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొన్నామని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రామన్నపేట : రామన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్ పక్కన ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రామన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో 41/5–6 నంబర్‌గల మైలు రాయివద్ద ట్రాక్ పక్కన ఉన్న మృతదేహాన్ని రైల్వేసిబ్బంది గమనించి అధికారులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. మృతుడు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సాలకమ్మ తెలిపారు.

ఇద్దరు కల్తీపాల విక్రేతల అరెస్ట్




పోలీసులు అరెస్ట్ చేసిన వ్యాపారులు పాండు, అజ్గర్, స్వాధీనం చేసుకున్న కల్తీపాల క్యాన్లు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని కనుముకుల, గౌస్‌కొండ గ్రామాల్లో ఆదివారం ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మిక దాడులు చేసి కల్తీపాలు తయారు చేస్తున్న పాలవ్యాపారులను అరెస్ట్ చేశారు. కనుముకులకు చెందిన పాల వ్యాపారులు పాండు, గౌస్‌కొండ గ్రామానికి చెందిన అజ్గర్ ఇళ్లపై పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి 350 లీటర్ల కల్తీపాలు, 2.1 లీటర్ల హైడ్రోజన్ పెరాక్సైడ్, 11 డోలోఫర్ స్కిమ్డ్ పాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అరెస్ట్ చేసి స్థానిక పోలీసులకు అప్పగించారుచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

భువనగిరి బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



భువనగిరి బస్టాండులో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న యువకులు

భువనగిరి : భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ ఆదివారం ప్రయాణికులతో కిక్కిరిసింది. రాత్రి పొద్దుపోయే వరకు బస్సుల కోసం ప్రయాణికులకు ఎదురు చూపులు తప్పలేదు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు ఆదివారం సెలవు కావడంతో యాదాద్రి క్షేత్రానికి భక్తుల సంఖ్య పెరిగింది. ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు సకాలంలో రాకపోవడంతో రద్దీ నెలకొంది. ప్రయాణికులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు.

పూర్వగిరిలో ఏక కుండాత్మక యజ్ఞం



విశ్వక్సేన పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపూర్వగిరి (పాతగుట్ట) లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ పాంచాహ్నిక ఏక కుండాత్మక యజ్ఞాన్ని ఆదివారం ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో ఆచార్యులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం వంటి పూజలు జరిపించారు. అనంతరం ఏక కుండాత్మక యజ్ఞానికి అంకురారోపణం చేశారు. లోక కల్యాణార్థమై, విశ్వ శాంతి కోసం పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఏక కుండాత్మక యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆచార్యులు, అధికారులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మర్రిగూడ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడ జెడ్పీ పాఠశాలలో 1985–86 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులు మదన్‌రెడ్డి, సోమారెడ్డి, అంజనేయశాస్త్రి, వెంకటేశం, లాలునాయక్, పర్వీన్‌బేగాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్యాల సబిత,యాదగిరిరెడ్డి, మాజీ సర్పంచ్ చెరుకు లింగంగౌడ్, విద్యార్థులు చెరుకు రమేష్‌గౌడ్, వీసం సుందర్, బుడ్డి యాదగిరి, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నల్ల బోతు యాదయ్య, వారాల రాజు, డాక్టర్ పద్మజ, శ్రీదేవి, పుష్పలత, కంచికట్ల శ్రీను, అబ్బయ్య, గిరి తదితరులున్నారు.

చౌటుప్పల్‌కు చేరుకున్న రామజన్మభూమి అక్షింతలు



రామజన్మభూమి అక్షింతలకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

చౌటుప్పల్ : అయోధ్యలోని శ్రీరామజన్మభూమి నుంచి బయలుదేరిన శ్రీరామ అక్షింతలు ఆదివారం రాత్రి భువనగిరి నుంచి చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చేరుకున్నాయి. స్థానిక శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం వద్దకు చేరుకున్న ప్రత్యేక వాహనంలోని అక్షింతలను ప్రజలు తమ తలపై ఎత్తుకొని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అక్షింతలు తీసుకున్న ప్రతి ఒక్కరి జన్మ ధన్యమవుతుందన్నారు. కాగా ఈ అక్షింతలను సోమవారం గ్రామంలోని ఇంటింటికి పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, మునగాల ప్రతాప్‌రెడ్డి, ఊడుగు వెంకటేశ్, వనం ధనుంజయ, బడుగు భిక్షపతి, బొబ్బిళ్ల మురళి, గోశిక అంజయ్య, భిక్షపతి, కొండూరి దుర్గయ్య, బడుగు సావిత్రి, పోలోజు కళమ్మ, సూరపల్లి లలిత, పోలోజు శ్రీనివాస్‌చారి, సుదర్శన్, రాము పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



వెంపటిలో భిక్షం అంతిమయాత్ర

తుంగతుర్తి: మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడ్పుల భిక్షం ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడు భిక్షంకు ఆరుగురు కుమార్తెలు. కుమారులు లేకపోవడంతో పెద్ద కూతురు ఎల్లమ్మ తండ్రికి దహన సంస్కారాలు నిర్వహించింది.

కవయిత్రి శ్రీపాద అర్చనాదేవికి సత్కారం



ప్రశంసాపత్రంతో అర్చనాదేవి

హుజూర్‌నగర్ : ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఆదివారం ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా నిర్వహించిన కవి సమ్మేళనం, కవితా పఠనం విభాగంలో హుజూర్‌నగర్‌కు చెందిన యువ కవయిత్రి శ్రీపాద అర్చనా దేవి నారీలోకం అనే కవితతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో శ్రీ కళావేదిక వారు ఆమెను తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేస్తున్నట్లుగా ధ్రువీకరిస్తూ ప్రపంచ రికార్డు నమోదు ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. దీంతో ఆమెను బంధువులు, స్నేహితులు అభినందించారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యపూజలు



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మఠంపల్లి : మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో ఆదివారం స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య అగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం చేశారు. లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధానాలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. స్వామిఅమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడవీధులలో ఘనంగా ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు పాల్గొన్నారు.

'సేంద్రియ' పశుపోషణ ఉత్తమం

- నడిగూడెం పశువైద్యాధికారి డాక్టర్ బి.అఖిల

పాడి పంట

నడిగూడెం : సేంద్రియ వ్యవసాయమే కాదు నేడు సేంద్రియ పద్ధతిలో పశుపోషణ కూడా ప్రాముఖ్యత సంతరించుకున్నదని నడిగూడెం మండల పశువైద్యాధికారిణి డాక్టర్ బి.అఖిల చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ పాలు, పాల పదార్థాలకు డిమాండ్ పెరుగుతోంది. సేంద్రియ పశుపోషణలో పొదుగు వాపు సమస్యలు తక్కువగా గమనించినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే సేంద్రియ పాలల్లో కలుషితాలు, సూక్ష్మజీవుల సంఖ్య సాధారణ పాల కంటే తక్కువగా, పోషక పదార్థాలు ఎక్కువగా ఉంటాయని, పర్యావరణ పరిరక్షణకు చేయూతనిచ్చే సేంద్రియ పశుపోషణను ఆచరించడం ఉత్తమని పేర్కొంటున్నారు.



నడిగూడెం మండలం సిరిపురంలో సేంద్రియ పద్ధతిలో సాగులో ఉన్న పశుగ్రాసం



సేంద్రియ పద్ధతిలో పెరుగుతున్న ఆవులు



డాక్టర్ బి.అఖిల మండల పశువైద్యాధికారిణి, నడిగూడెం

సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన మేతనే వాడాలి

- సేంద్రియ పద్ధతిలో ఒంగోలు, పుంగనూరు, తార్కార్కర్, దియోని తదితర దేశీయ పశువుల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- సేంద్రియ వ్యవసాయం ఆచరించిన భూమిలో పశువులు పెరిగినవై ఉండాలి.
- ఇందుకు రైతులు సొంత భూమిని 1–3 సంవత్సరాల కాలంలో ఎలాంటి రసాయన అవశేషాలు, కృత్రిమ ఎరువులు లేకుండా కృషి చేసి, సిద్ధంగా ఉంచుకోవడం ఉత్తమం.
- పశువులను కట్టివేయకుండా పచ్చిక బయళ్లలో తిరిగే విధంగా, ఒత్తిడికి గురి కాకుండా స్వేచ్ఛగా తిరగనివ్వాలి.
- పశువు స్వభావం, ప్రవర్తనకు అనుకూలంగా ఉండే విధంగా పోషించాలి.
- సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన మేతనే వాడాలి. ఎలాంటి ఎరువులు, క్రిమికీటక సంహారక మందులు మేతపై వాడకూడదు.
- పునరుత్పత్తికి కృత్రిమ గర్భధారణ విధానాన్ని పాటించవచ్చు. హార్మోన్లు వాడరాదు.
- ఆరోగ్యపరిరక్షణకు అత్యవసర పరిస్థితుల్లో హోమియో, ఆయుర్వేద వైద్య విధానాలు ఆచరించాలి. తప్పనిసరి పరిస్థితులలో టీకాలు వాడవచ్చు.

పశువుల పేడ, మూత్రంతో ప్రయోజనాలు

పశువుల పేడ అద్భుతమైన సేంద్రియ ఎరువు. ఇందులో 0.30 శాతం నత్రజని, 0.18 శాతం భాస్వరం, 0.18 శాతం పొటాష్, 0.36 శాతం సున్నం, 0.18 శాతం పొటాష్, తదితర పోషకాలు ఉంటాయి. అలాగే పశువుల మూత్రంలో 1.21 శాతం నత్రజని, 1.01. శాతం భాస్వరం, 1.31 శాతం పొటాష్, 1.01. శాతం సున్నం ఉంటాయి. రాష్ట్రం మొత్తం మీద లభ్యమయ్యే పశువుల పేడను 83శాతం ఎరువు, 10 శాతం పిడకలు, 7 శాతం ఇతర అవసరాలకు వాడుతున్నారు. ప్రతి పశువు నుంచి ఏటా దాదాపు 4 మెట్రిక్ టన్నుల పేడ, 3వేల లీటర్ల మూత్రం లభిస్తుంది. పశువుల పేడను ఎరువుగా వాడుకుంటే యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, మ్యూరెట్ పొటాష్‌లను సరితూగే పోషకాలు లభిస్తాయి. పశువుల పేడ సేంద్రియ వ్యవసాయం విజయవంతం కావడానికి, అధిక ఉత్పత్తులు సాధించడానికి అవసరం. పశుగ్రాసాల సాగుకు తోడ్పతుంది. పశువుల పేడతో వానపాములు ఎరువు తయారు చేసుకోవచ్చు.

- పేడ ద్వారా ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన బయోగ్యాస్ పొందవచ్చు.25 కిలోల పేడతో 500 గ్రాముల ఎల్‌పీజీకి సమానమైన బయోగ్యాస్ లభిస్తుంది. అలాగే పేడ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు.
- పశువులు కలిగిన రైతులు బయోగ్యాస్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఆవు పేడలో 18 రకాల ఖనిజాలున్నాయని శాస్త్రవేత్తలు కొన్నేళ్ల క్రితమే నిర్ధారించారు. గోమూత్రం, గోమయాన్ని ఆయుర్వేద వైద్యులు దాదాపు 32 రకాల ఔషధాల్లో వినియోగిస్తున్నారు. గోవు ద్వారా లభించే పాలు, పెరుగు, నెయ్యి, మూత్రం, పేడ అమృతంతో సమాన స్థాయిని పొందాయి. దేశవాళీ ఆవు పేడ, మూత్రానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. నేటి పరిస్థితుల్లో రైతుల ఇంట దేశవాళీ ఆవు ఉంటే బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.